# అంతా గ్యాస్..గ్యారెంటీలు బోగస్

మొదటిపేజీ తరువాయి...

గుర్తుచేశారు. ఆదివారం బెంగళూరులోని జేడీఎస్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ గ్యారెంటీల పేరుతో ఓట్లు కొల్లగొట్టేందుకు కాంగ్రెస్ కుయుక్తులు పన్నుతున్నదని ఆరోపించారు. కర్ణాటకలో అమలుచేయలేక చేతులెత్తేసి, సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తెలంగాణకు వెళ్లి అబద్ధాలు చెప్పడం విడ్డూరంగా ఉన్నదని ధ్వజమెత్తారు. రూ.లక్ష వరకు పంట రుణమాఫీ చేస్తామన్న కాంగ్రెస్.. ఇంకా ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. రుణమాఫీ పేరుతో రాజస్థాన్ రైతులను మోసం చేయాలని చూస్తున్నదని తీవ్రంగా మండిపడ్డారు.

### 5 గంటలు కాదు 2 గంటల విద్యుత్తే ఇవ్వలేదు

వ్యవసాయానికి 5 గంటల విద్యుత్తు ఇస్తామని చెప్పి, రెండు గంటల కరెంట్ కూడా ఇవ్వటం లేదని కాంగ్రెస్ పార్టీపై కుమారస్వామి ధ్వజమెత్తారు. మరోవైపు విద్యుత్తు చార్జీలు పెంచి పేద, మధ్య తరగతి ప్రజలపై పెనుభారం మోపిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ, తెలంగాణ సర్కారు వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్తు ఇస్తున్నదని, రైతుబంధు విజయవంతంగా అమలు అవుతున్నదని ప్రశంసించారు. కేసీఆర్ రైతుబంధు కింద ఎకరానికి రూ.10 వేలు ఇస్తున్నారని, ఈ పథకం కింద రూ.73 వేల కోట్లకు పైగా రైతుల ఖాతాల్లో జమచేశారని వివరించారు. పెట్టుబడి సాయాన్ని రూ.15 వేలు చేస్తామన్న కాంగ్రెస్ అబద్ధాలను తెలంగాణ ప్రజలు గుర్తించాలని పిలుపునిచ్చారు.

### ఏ గ్యారెంటీ అమలు కాలేదు

కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రకటించిన 5 గ్యారెంటీల్లో ఏది కూడా అమలు కాలేదని కుమారస్వామి విమర్శించారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం తప్ప ఏ ఒక్క పథకం సక్రమంగా అమలు కావటం లేదని తెలిపారు. గృహలక్ష్మి ఇప్పటికీ 30 నుంచి 36 లక్షల మంది మహిళలకు అమలు కావడం లేదని వెల్లడించారు. గృహజ్యోతి పథకం ద్వారా ప్రతి ఇంటికి 200 యూనిట్లు ఉచితంగా విద్యుత్తు ఇస్తామని చెప్పి, ఒక్కో వినియోగదారునికి 30 నుంచి 50 యూనిట్ల వరకు కోత పెడుతున్నదని వివరించారు. విద్యుత్తు కోతలతో 65 లక్షల హెక్టార్లలో పంట నష్టం జరిగిందని, దాని విలువ రూ.33,700 కోట్లు అని ఆందోళన వ్యక్తం చేశారు. కర్ణాటక రైతులకు ఇంత నష్టం జరిగినా కాంగ్రెస్ సర్కారు ఎందుకు ఆదుకోవడం లేదని నిలదీశారు. యువనిధి పథకం ఇప్పటికీ ప్రారంభం కాలేదని మండిపడ్డారు. గ్రాడ్యుయేట్లు, డిప్లొమా హోల్డర్లందరికీ భృతి ఇస్తామని, ఇప్పుడు 2023-24లో ఉత్తీర్ణులైనవారికే ఇస్తామంటూ మాట మార్చిందని ధ్వజమెత్తారు. శక్తి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించే పథకం వల్ల కూడా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యార్థులకు బస్సు సౌకర్యం లేక జేసీబీల్లో వెళ్తున్నారని వివరించారు.

### టెంపరరీ సీఎం.. డూప్లికేట్ సీఎం

కర్ణాటకకు ప్రస్తుతం ఇద్దరు సీఎంలు ఉన్నారని, వీరిలో ఒకరు (సిద్ధరామయ్య) టెంపరరీ సీఎం, మరొకరు (శివకుమార్) డూప్లికేట్ సీఎం అని కుమారస్వామి ఎద్దేవా చేశారు. వీరిద్దరిలో పార్టీ అధిష్ఠానానికి ఎవరు ఎక్కువ డబ్బు సంచులు ముట్టజెప్పితే వారే సీఎం పోస్టులో కొనసాగుతారని ఆరోపించారు. 2013 నుంచి 2018 వరకు సిద్ధరామయ్య సీఎంగా ఉన్నపుడే కర్ణాటకను అప్పులపాలు చేశారని విమర్శించారు. అణగారిన వర్గాల ప్రతినిధిగా చెప్పుకునే సిద్ధరామయ్య.. రూ.కోట్లు విలువ చేసే గడియారం ధరిస్తారని తెలిపారు. ఒక షాపింగ్ మాల్ నుంచి సిద్ధరామయ్య తన ఇంట్లో ఫర్నిచర్ కోసం రూ.కోటి 90 లక్షలు ఖర్చు చేస్తే, మరో వ్యక్తి బిల్లు చెల్లించాడని ఆరోపించారు. కర్ణాటక అప్పు రూ.10 లక్షల కోట్లు దాటినా.. మంత్రులకు కొత్త కార్లు, వారి క్వార్టర్లను అందంగా ముస్తాబు చేస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## కాంగ్రెస్ మాడల్ చెల్లని గిఫ్ట్ కూపన్

కాంగ్రెస్ పార్టీ ఓటర్లకు నోట్లు ఇస్తే పట్టుబడుతామని తెలివిగా గిఫ్ట్ కూపన్లు పంచడానికి తెరతీసిందని కుమారస్వామి ఆరోపించారు. ఇది కాంగ్రెస్ మాడల్ అని, కర్ణాటక ఎన్నికల్లో ఆ పార్టీ ఇదే విధానాన్ని అనుసరించిందని అన్నారు. ఇలాంటి మోసాల పట్ల తెలంగాణ ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. రూ.8,000, రూ.5,000 క్యూఆర్ కోడ్‌తో ఉన్న కూపన్లను పంచుతున్నదని, కర్ణాటకలో చివరి నిమిషంలో ఇలాగే చేసిందని ఆరోపించారు. కర్ణాటకలోని రామనగర, మాగడి, కునిగల్, కనుకపుర తదితర 50కి పైగా అసెంబ్లీ నియోజకవర్గాల్లో గిఫ్ట్ కూపన్లు పంచిందని తెలిపారు. అయితే ఎన్నికలు ముగిశాక షాపింగ్‌మాల్స్‌కు వెళ్తే ఆ కూపన్లు చెల్లుబాటు కాలేదని, ఇదీ కాంగ్రెస్ మోసమని విమర్శించారు. ఈ సందర్భంగా చెల్లని కూపన్లను కుమారస్వామి మీడియాకు చూపించారు. తెలంగాణ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఇలాగే మోసం చేసే అవకాశం ఉన్నదని అనుమానం వ్యక్తం చేశారు. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లోనూ ఇలాంటి గిఫ్ట్ కూపన్ల మోసానికి కాంగ్రెస్ పాల్పడే అవకాశం లేకపోలేదని పేర్కొన్నారు.

# కాంగ్రెస్ టీవీ ప్రకటనలు ఆగలేదు

- నియమావళికి విరుద్ధంగా కాంగ్రెస్ దుష్ప్రచారం
- ప్రసారం కొనసాగిస్తున్న పలు టెలివిజన్ చానళ్లు
- రేవంత్ ప్రసంగాలు దాడులను ప్రేరేపిస్తున్నాయి
- ఇప్పటికే ఇద్దరు బీఆర్ఎస్ అభ్యర్థులపై దాడులు
- ఎన్నికల సంఘానికి బీఆర్ఎస్ ఫిర్యాదు

హైదరాబాద్, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ): ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఉన్న కాంగ్రెస పార్టీ ప్రకటనలను నిలిపివేయాలని బీఆర్ఎస్ కోరింది. ఈ విషయంలో ఎన్నికల సంఘం ఇచ్చిన ఉత్తర్వులు వెంటనే అమలయ్యే విధంగా చూడాలని పేర్కొంది. ఈ మేరకు బీఆర్ఎస్ ప్రధానకార్యదర్శి భరత్‌కుమార్ నేతృత్వంలో పార్టీ లీగల్‌సెల్ బృందం బీఆర్‌కేఆర్ భవన్‌లో సోమవారం సీఈవో వికాస్‌రాజ్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) నిబంధనలకు విరుద్ధంగా కాంగ్రెస్ పార్టీ రూపొందించిన ఎన్నికల ప్రకటనలను టీవీ చానళ్లలో ప్రసారం చేస్తున్నారని తెలిపింది. ఎంసీఎంసీకి చూపించింది ఒకటి, టీవీలలో ప్రసారం అయ్యేవి వేరొకటి అని ఆరోపించింది. దీనిపై తాము ఇంతకుముందు ఫిర్యాదుచేసినప్పుడు సదరు ప్రకటనలను నిలిపివేయాలని ఎన్నికల సంఘం ఆదేశాలు ఇచ్చిందని, కాని అవి అమలు కావడంలేదని తెలిపింది. ఆ ప్రకటనలు టీవీ చానళ్లలో ఇంకా కొనసాగుతున్నాయని తెలిపారు.



భరత్‌కుమార్

### రేవంత్‌రెడ్డిపై నిషేధం విధించాలి

పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని స్టార్ క్యాంపెయినర్‌గా ప్రచారం చేయకుండా నిషేధించాలని బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేసింది. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రెచ్చగొట్టే ప్రసంగాలతో బీఆర్ఎస్ అభ్యర్థులపై దాడులను ప్రోత్సహిస్తున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. గత నెల 30న కాంగ్రెస్ పార్టీ కార్యకర్త బీఆర్ఎస్ దుబ్బాక అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కత్తితో దాడి చేశారని తెలిపారు. అచ్చంపేట బీఆర్ఎస్ అభ్యర్థి గువ్వల బాలరాజుపై కూడా ఈ నెల 11న రాత్రి 10 గంటల ప్రాంతంలో కాంగ్రెస్ అభ్యర్థి వంశీ కృష్ణ, అతని అనుచరుల దాడి చేశారని పేర్కొన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నాటి నుంచి రేవంత్‌రెడ్డి ఉద్దేశ పూర్వకంగా, రెచ్చగొట్టే విధంగా ప్రసంగాలు చేస్తున్నారని, బీఆర్ఎస్ నాయకులు, అభ్యర్థులపై దాడులను ప్రోత్సహించే విధంగా ప్రసంగాలు చేస్తున్నారని వివరించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ నాయకులు, అభ్యర్థులపై భౌతికంగా దాడులకు పాల్పడుతున్నారని, దాడులకు ప్రయత్నిస్తున్నారని, దాడులను ప్రేరేపిస్తున్నారని ఆరోపించారు. కొత్త ప్రభాకర్‌రెడ్డి ఇంకా దవాఖానలో చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. తమ పార్టీకి చెందిన ఇద్దరు అభ్యర్థులు గువ్వల బాలరాజు, కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కాంగ్రెస్ పార్టీ హత్యా ప్రయత్నం చేసిందని తెలిపారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఓటర్లను భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ అభ్యర్థులను స్వేచ్ఛగా, ప్రశాంతంగా ప్రచారం చేసుకొనే అవకాశం కల్పించాలని కోరారు. గువ్వల బాలరాజుపై దాడి జరిగి 20 గంటలైనా ఒక్కరిని కూడా అరెస్ట్ చేయాలేదని ఈసీ దృష్టికి తీసుకొచ్చారు. దాడులకు పాల్పడిన కాంగ్రెస్ అభ్యర్థి స్వేచ్ఛగా తిరుగుతున్నారని, ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.

# కాంగ్రెస్ క్రిస్టియన్ డిక్లరేషన్ ఓ మోసం

- సమస్యలపై చర్చిద్దామని పిలిచి తప్పుదారి పట్టించారు
- క్రైస్తవుల గురించి కాంగ్రెస్ ఎప్పుడైనా ఆలోచించిందా?
- విలేకరుల సమావేశంలో క్రిస్టియన్ బిషప్‌లు, పాస్టర్లు



మీడియాతో మాట్లాడుతున్న క్రైస్తవ పెద్దలు


హైదరాబాద్, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ): క్రైస్తవ సోదరుల సమావేశమని పిలిస్తే వచ్చామని, తీరా ఇక్కడికి వచ్చిన తర్వాత దొంగతనంగా కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా డిక్లరేషన్ అని ప్రకటించారని పలువురు క్రిస్టియన్ బిషప్‌లు, పాస్టర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. సికింద్రాబాద్ అమృతవాణి సమీపంలోని భారత క్రిస్టియన్ కౌన్సిల్ కార్యాలయంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. క్రిస్టియన్ కౌన్సిల్ సమావేశం ఉన్నదని పిలిస్తే వచ్చామని, బీఆర్ఎస్, కాంగ్రెస్‌తోపాటు అన్ని పార్టీల నాయకులు వస్తారని, మన సమస్యలపై చర్చిద్దామని చెప్పారని తెలిపారు. కానీ ఇక్కడికి వచ్చిన తర్వాత కాంగ్రెస్ డిక్లరేషన్ అని చెప్పుకోవడం సరికాదని మండిపడ్డారు. క్రైస్తవుల సమస్యలను కాంగ్రెస్ ఏనాడైనా పట్టించుకున్నదా? అని నిలదీశారు. అసత్య సమాచారంతో, మనసులో తప్పుడు ఉద్దేశంతో క్రైస్తవ మతపెద్దలను అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలోనే బీఆర్ఎస్ పార్టీకి మద్దతుగా పెద్దఎత్తున క్రైస్తవులతో భారీ సమావేశం ఏర్పాటు చేస్తామని బిషప్ భాస్కర్ ములకల తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో భారత క్రిస్టియన్ కౌన్సిల్ ఫౌండర్, బిషప్ భాస్కర్ ములకల, క్రిస్టియన్ పొలిటికల్ ఫ్రంట్ ప్రెసిడెంట్ జెరుసలేం మత్తయ్య, తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ చైర్మన్ ఏనుగుల కరుణాకర్, తెలంగాణ బిషప్స్ ఫెడరేషన్ కన్వీనర్, బిషప్ స్వామిదాసు, క్రిస్టియన్ ఉమెన్ ఎంపవర్మెంట్ సొసైటీ సెక్రటరీ మేడం కోమలి, బీఆర్ఎస్ క్రిస్టియన్ కో ఆప్షన్ సభ్యురాలు విద్యాస్రవంతి, పాస్టర్ ఎమ్ మోహన్‌బాబు, క్యాథలిక్ లీడర్ రాయిడన్ రోచ్, బిషప్ గొల్లపల్లి జాన్, రెవ ప్రసాద్ దరి, షమ్మ జోయెల్ తదితరులు పాల్గొన్నారు.

## వివిధ పార్టీల ప్రచార వీడియో ప్రకటనల అనుమతులు రద్దు

**బీఆర్ఎస్ ఫిర్యాదుతో ఎన్నికల సంఘం నిర్ణయం**

హైదరాబాద్, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ): ఎన్నికల కమిషన్.. వివిధ పార్టీలకు ఇచ్చిన ప్రచార వీడియో ప్రకటనల అనుమతులను రద్దుచేసింది. కాంగ్రెస్ పార్టీ 6 వీడియోలు, బీజేపీ 5 వీడియోలు, బీఆర్ఎస్ 4 వీడియోలను మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) cనిబంధనలకు విరుద్ధంగా రూపొందించారని పేర్కొన్నది. దీంతో ఈ ప్రకటనల అనుమతిని రద్దు చేస్తున్నట్టు సీఈవో వికాస్‌రాజ్ తెలిపారు. ఈ ప్రకటనలను ఆయా చానెళ్లు వెంటనే నిలిపివేయాలని ఆదేశించారు. సీఎం కేసీఆర్‌పై, బీఆర్ఎస్‌పై అభ్యంతరకరంగా ప్రకటనలు రూపొందించారంటూ బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. దీంతో ప్రకటనలు మరోసారి పరిశీలించిన ఎన్నికల సంఘం వాటిని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకొన్నది.

## లోకం పోకడ




## కాంగ్రెస్ అభ్యర్థి కవ్వంపల్లిపై ఫిర్యాదు

మానకొండూర్, నవంబర్ 13: మానకొండూరు బీఆర్ఎస్ అభ్యర్థి రసమయి బాలకిషన్‌పై తప్పుడు ప్రచారం చేసిన డీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణపై బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు మానకొండూర్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ దాఖలు చేసిన నామినేషన్ అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఉన్నదని రిటర్నింగ్ అధికారికి ఉద్దేశ పూర్వకంగా ఫిర్యాదు చేసి సోషల్ మీడియాలో రసమయి నామినేషన్‌ను ఎన్నికల అధికారులు తిరస్కరించినట్టు ప్రచారం చేశాడని ఆయన పేర్కొన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించిన కవ్వంపల్లిపై చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసు అధికారులను కోరారు.

## వర్షకాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 36.6°c | 14.6°c |
| మెదక్ | 34.9°c | 15.9°c |
| నల్లగొండ | 34.8°c | 21.2°c |
| రంగారెడ్డి | 34.5°c | 15.2°c |
| నిజామాబాద్ | 32.1°c | 19.7°c |
| ఖమ్మం | 32.0°c | 22.0°c |
| వరంగల్ | 32.0°c | 21.0°c |
| కరీంనగర్ | 32.0°c | 20.0°c |
| హైదరాబాద్ | 31.4°c | 19.8°c |
| మహబూబ్‌నగర్ | 31.0°c | 21.0°c |

# పాత కాంగ్రెస్ ఔట్.. 'పచ్చ'కాంగ్రెస్ ఇన్

- రేవంత్ రాకతో కాంగ్రెస్‌లో కొత్త పోకడలు
- అవమానాలతో సీనియర్లు బయటకు
- 25 మందికిపైగా పాతనేతలు గుడ్‌బై
- వారి స్థానాన్ని ఆక్రమించిన 'పచ్చ'నేతలు
- కాంగ్రెస్‌ను మార్చే కుట్రలో రేవంత్ విజయం
- 33 మంది కొత్త నేతలకు టికెట్

హైదరాబాద్, నవంబర్ 13(నమస్తే తెలంగాణ): రేవంత్‌రెడ్డి రాకతో తెలంగాణలో కాంగ్రెస్ స్వరూపం మారిపోయింది. పార్టీ కాస్తా 'పచ్చ' కాంగ్రెస్‌గా మారిపోయింది. పీసీసీ చీఫ్ కాగానే తన ప్లాన్‌ను అమలు చేస్తూ వస్తున్న రేవంత్‌రెడ్డి పార్టీని నమ్ముకున్న పాతనేతలను వెళ్లగొట్టి పచ్చనేతలతో నింపేస్తున్నారు. కాంగ్రెస్ తప్ప మరో పార్టీ తెలియని పొన్నాల లక్ష్మయ్య పార్టీని వీడారు. తండ్రి హయాం నుంచి కాంగ్రెస్‌తోనే ఉంటున్న మర్రి శశిధర్‌రెడ్డి కూడా బయటకు వెళ్లిపోయారు. తండ్రి వారసత్వాన్ని కొనసాగించేందుకు వచ్చిన పీ విష్ణువర్ధన్‌రెడ్డి కూడా కాంగ్రెస్‌కు రాంరాం చెప్పేశారు. కాంగ్రెస్‌తో ఏం సంబంధమూ లేని నేతలే ఇప్పుడా పార్టీలో ఉన్నారు. రేవంత్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, మైనంపల్లి హన్మంతరావు, సీతక్క వంటి వారు పార్టీలోకి వచ్చి పెత్తనం చలాయిస్తున్నారు. ఈ పరిణామాలు చూస్తున్న విశ్లేషకులు కాంగ్రెస్ కాస్తా 'పచ్చ' కాంగ్రెస్‌గా మారిందనే అభిప్రాయానికి వచ్చారు. రేవంత్ కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచి ఇప్పటి వరకు 30 మందికిపైగా అసలు సిసలైన కాంగ్రెస్ నేతలు పార్టీని వీడారు. వీరిలో పొన్నాల లక్ష్యయ్య, మర్రి శశిధర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, పాల్వాయి స్రవంతి, సంగిశెట్టి జగదీశ్వర్‌రావు, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, డీకే అరుణ, నందికంటి శ్రీధర్, కంఠారెడ్డి తిరుపతిరెడ్డి వంటి సీనియర్ నేతలు ఉన్నారు. అదే సమయంలో 35 మందికిపైగా ఇతర పార్టీ నేతలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వీరిలో సుమారు డజనుకు పైగా పాత టీడీపీ నేతలు ఉండడం గమనార్హం.

### అవమానాలు... అవహేళనలు

రేవంత్ పీసీసీ అధ్యక్షుడయ్యాక పార్టీపై క్రమంగా పట్టుపెంచుకునే ప్రయత్నం చేశారు. అందులో భాగంగా సీనియర్లకు పొగపెట్టి వారి ప్రాధాన్యాన్ని తగ్గించే కుట్రకు తెరలేపారు. అవమానాలకు గురిచేసి ఎవరికి వారే స్వయంగా పార్టీని వీడేలా చేయడంలో విజయం సాధించారు. రేవంత్ తీరు నచ్చని మర్రి శశిధర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, వీహెచ్ వంటి నేతలు పలుమార్లు తిరుగుబాటు జెండా ఎగరవేశారు. ఓ దశలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, జగ్గారెడ్డి వంటి వారు కూడా పార్టీ వీడతారన్న ప్రచారం జరిగింది.

### పచ్చ నేతలతో పార్టీ భర్తీ

టీడీపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన రేవంత్ పాతమిత్రులను తీసుకొచ్చే ప్రణాళికను ముందే రచించి పెట్టుకున్నారు. టీడీపీ నేతలు సీతక్క, రమేశ్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణ, విజయరమణారావు, వేం నరేందర్‌రెడ్డి వంటి వారిని పార్టీలోకి తీసుకొచ్చారు.

## కాంగ్రెస్‌ను వీడింది వీరే

పొన్నాల లక్ష్యయ్య, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, మర్రి శశిధర్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, డీకే అరుణ, నందికంటి శ్రీధర్, నాగం జనార్దన్‌రెడ్డి, కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, కొత్త మనోహర్‌రెడ్డి, సాజిద్‌ఖాన్, గండ్రత్ సుజాత, సుభాష్‌రెడ్డి, సంగిశెట్టి జగదీశ్వర్‌రావు, పీ విష్ణువర్ధన్‌రెడ్డి, సొహైల్‌ఖాన్, చెరుకు సుధాకర్, చెలమల కృష్ణారెడ్డి, పటేల్ ప్రభాకర్‌రెడ్డి, పటోళ్ల శశిధర్‌రెడ్డి, గంట రాములు, రాగిడి లక్ష్మారెడ్డి, జిట్టా బాలకృష్ణ, సంభాని చంద్రశేఖర్, పాల్వాయి స్రవంతి, మానవతారాయ్, సోమశేఖర్‌రెడ్డి, నగేశ్ ముదిరాజ్, కురువ విజయ్‌కుమార్.

## ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన నేతలు

1.పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
2.జూపల్లి కృష్ణారావు
3.కోరం కనకయ్య
4.విజయాబాయి
5.తుమ్మల నాగేశ్వరరావు
6.నాగరాజు (మాజీ ఐపీఎస్)
7.కూచుకుల్ల రాజేశ్‌రెడ్డి
8.సరితా తిరుపతయ్య
9.రఘునాథ్‌యాదవ్
10.కొత్త జైపాల్‌రెడ్డి
11. కసిరెడ్డి నారాయణరెడ్డి
12.ఆరెంజ్ సునీల్‌రెడ్డి
13.వినయ్‌కుమార్‌రెడ్డి
14.కంది శ్రీనివాస్‌రెడ్డి
15.శ్రీహరిరావు
16.శ్యాంనాయక్
17.యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
18.ఏనుగు రవీందర్‌రెడ్డి
19.వేముల వీరేశం
20.మైనపల్లి హనుమంతరావు
21.మైనంపల్లి రోహిత్‌రావు
22.బీ మనోహర్‌రెడ్డి
23.ఏ చంద్రశేఖర్
24.సీతా దయాకర్‌రెడ్డి
25.సుధీర్‌రెడ్డి
26.మండవ వెంకటేశ్వరరావు
27.రేవూరి ప్రకాశ్‌రెడ్డి
28.ప్రతాప్‌రెడ్డి
29.జగదీశ్‌గౌడ్
30.బాబురావు రాథోడ్ (బోథ్ ఎమ్మెల్యే)
31.బాలసాని లక్ష్మీనారాయణ
32. నల్లాల ఓదెలు
33. వివేక్ వెంకటస్వామి
34. మోత్కుపల్లి నర్సింలు
35. కపిలవాయి దిలీప్‌కుమార్

**కాంగ్రెస్‌లోకి వచ్చిన పాత టీడీపీ నేతలు**

సీతక్క, రమేశ్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణ, విజయరమణారావు, వేం నరేందర్‌రెడ్డి, మైనంపల్లి హన్మంతరావు, ఏ చంద్రశేఖర్, బండి రమేశ్, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, మండవ వెంకటేశ్వరరావు, బాలసాని లక్ష్మీనారాయణ, పాయం వెంకటేశ్వర్లు, మోత్కుపల్లి నర్సింహులు.

# గృహజ్యోతి.. కాంగ్రెస్ ద్రోహం

- కర్ణాటకలో పేరుకే ఉచిత పవర్.. పేదోడికి బిల్లు ట్రిపుల్
- పథకానికి ఎక్కడాలేని నిబంధనలు
- ఉచితమంటే నెలకు 200 యూనిట్లు ఉచితం కాదట
- గతేడాది వరకు వాడినంతే ఉచితమట
- ఆ లిమిట్ దాటితే మూడురెట్ల బిల్లు
- కొత్త కనెక్షన్‌కు 59 యూనిట్లే ఉచితం
- బిల్లు పెండింగ్ ఉన్నా అనర్హులే!

కర్ణాటక నుంచి నమస్తే తెలంగాణ ప్రత్యేక ప్రతినిధి వెల్జాల చంద్రశేఖర్

ఉచిత కరెంటు అంటే ఏమిటి? ఎలాంటి బిల్లు లేకుండా, డబ్బు కట్టాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం ఉచితంగా విద్యుత్తు సరఫరా చేస్తే ఉచిత కరెంటు.. అంతే కదా? కర్ణాటక ప్రజలు కూడా అలాగే అనుకొన్నారు. కానీ, గతంలోకంటే ఎక్కువ బిల్లులు చెల్లించటమే ఉచిత కరెంటు అని ఇప్పుడు చెప్తున్నారు.

బెంగళూర్, నవంబర్ 13: కర్ణాటకలో కాంగ్రెస్ 'ఐదు గ్యారెంటీ' లీలలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. గ్యారెంటీలతో ప్రభుత్వం ఇస్తున్న షాకులకు అక్కడి ప్రజలకు దిమ్మ తిరిగిపోతున్నది. అరచేతిలో వైకుంఠం చూపించి తమను కాంగ్రెస్ బురిడీ కొట్టించిందని ప్రజలు లబోదిబోమంటున్నారు. తెలంగాణలో ఆ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు కూడా ఇలాంటి షాకులేనని, వాటిని నమ్మి ఓటేస్తే జీవితాలు షేక్ అయిపోతాయని హెచ్చరిస్తున్నారు. అన్నీ ఉచితమని ఎన్నికల్లో చెప్పి.. తీరా అధికారంలోకి వచ్చాక అడ్డమైన షరతులు పెట్టి నడ్డి విరుస్తున్నారని వాపోతున్నారు. ఐదు గ్యారెంటీలు పచ్చి మోసం, దగా అని మండిపడుతున్నారు. అందుకు గృహజ్యోతి పథకమే తార్కాణం అని విశ్లేషిస్తున్నారు.

### గృహజ్యోతి కాదు గృహభ్రాంతి

పేద, ధనిక తారతమ్యం లేకుండా గృహ వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్తు అందించే 'గృహజ్యోతి' పథకం కర్ణాటకలో ప్రకటించిన ఐదు గ్యారెంటీల్లో ఒకటి. దీని వల్ల రాష్ట్ర వ్యాప్తంగా 2.14 కోట్ల కుటుంబాలకు లబ్ధి కలుగుతుందని ప్రభుత్వం ప్రకటించింది. ఈ పథకానికి ప్రభుత్వం పెట్టిన నిబంధనలను చూస్తే మతి పోయింది. ఉచిత విద్యుత్తు పథకం అందరికీ వర్తిస్తుందని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఊదరగొట్టింది. ఈ పథకం కింద ప్రతి నెలా వినియోగంలో 200 యూనిట్ల వరకు ఉచితమని ప్రజలు అనుకొన్నారు. కానీ, ఇక్కడే ప్రజలను కాంగ్రెస్ బకరాలను చేసింది. 2022 - 2023 ఆర్థిక సంవత్సరం వరకు సగటున 200 యూనిట్లలోపు కరెంటును వినియోగించిన కుటుంబాలకే ఈ పథకం వర్తిస్తుందని మెలిక పెట్టింది. పోనీ 200 యూనిట్ల కంటే తక్కువ వాడిన వారికి ఇబ్బంది ఉండదని అనుకుంటే అందులోనూ మరో మెలిక పెట్టింది. ఒక గృహ వినియోగదారుడు గత సంవత్సరం సగటున 150 యూనిట్ల విద్యుత్తు వినియోగించినట్టయితే, దానికి అదనంగా 10 శాతం కలిపి (15 యూనిట్లు) మొత్తంగా 150+15=165 యూనిట్లుగా లెక్కిస్తారు. దీనినే ప్రామాణికంగా తీసుకొని అంతవరకు మాత్రమే ఉచితంగా పరిగణిస్తారు. 166వ యూనిట్ నుంచి ఎంత వినియోగిస్తే అంత మొత్తానికి బిల్లు చెల్లించాల్సిందే. 200 యూనిట్లు ఉచితం అన్నారు కదా అంటే కుదరదు.. అదంతే.. కాంగ్రెస్ ప్రభుత్వం లెక్క ఇంతే. ఒకవేళ గత ఏడాది విద్యుత్తు కనెక్షన్ లేకుండా ఈ ఏడాది కొత్తగా తీసుకొంటే, వారికి నెలకు సగటున 53 యూనిట్లను పరిగణనలోకి తీసుకొని, దానికి 10 శాతం కలిపి 58-59 యూనిట్లుగా లెక్కిస్తారు. అంటే కొత్తగా కనక్షన్ పొందిన వారికి 59 యూనిట్ల వరకే ఉచితం. 60వ యూనిట్ నుంచి 100 యూనిట్ల వరకు యూనిట్‌కు రూ.5.60 చొప్పున కట్టాల్సిందే. ఒకవేళ వినియోగం వంద దాటితే మొత్తం ఒకటో యూనిట్ నుంచి యూనిట్‌కు రూ.7 చొప్పున బాదుతారు.

### పెరిగిన చార్జీలతో మూడింతల భారం

కర్ణాటకలో గత బీజేపీ ప్రభుత్వం విద్యుత్తు చార్జీలను మూడు శ్లాబుల్లో వసూలు చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మూడు శ్లాబులను రెండుకు కుదించింది. 1- 100 యూనిట్ల వరకు యూనిట్‌కు రూ.4-75 చొప్పున, 101 యూనిట్ నుంచి యూనిట్‌కు రూ.7 చొప్పన వసూలు చేస్తున్నది. అయితే, ఇక్కడే చాలామందికి తెలియకుండా ఓ మెలికపెట్టింది. వినియోగం 100 యూనిట్లు దాటితే ఒకటో యూనిట్ నుంచి యూనిట్‌కు రూ.7 చొప్పున బాదుతున్నది. దీంతో ఉచిత కరెంటు దేవుడెరుగు.. ఇప్పుడు ఇంట్లో కరెంటు బుగ్గ వెయ్యాలంటేనే ఒళ్లు జలదరిస్తున్నదని ప్రజలు వాపోతున్నారు. గతంలో నెలకు రూ.800 వచ్చే బిల్లు, తాజా నిబంధనలతో మూడింతలు పెరిగి రూ.2,400 వరకు వస్తున్నదని లబోదిబోమంటున్నారు.

### పెండింగ్ బిల్స్ ఉన్నా ఉచితం లేదు

ఉచిత విద్యుత్తు పథకంలో మరో మాయాజాలం ఏమిటంటే, ప్రభుత్వం ఉచితంగా ప్రకటించిన 200 యూనిట్లకు ఒక్క యూనిట్ (201) అదనంగా కాల్చినా గృహజ్యోతి పథకం వర్తించదు. ఇక ఏ వినియోగదారుడైనా పెండింగ్ బిల్స్ ఉంటే ఈ పథకానికి అర్హులు కారు. గృహజ్యోతి పథకం కోసం వినియోగదారులు విధిగా తమ వివరాలు, డాక్యుమెంట్లతో వెబ్ పోర్టల్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలి. ప్రతి రోజు 5 నుంచి 7 లక్షల మంది దరఖాస్తు చేసుకొన్నప్పటికీ ఇప్పటివరకు ఈ పథకానికి ఎంపికచేసిన లబ్ధిదారుల సంఖ్య అక్షరాలా 8 లక్షలే. ప్రభుత్వం మాత్రం ఈ పథకం 2.14 కోట్ల మందికి వర్తిస్తుందని చెప్తున్నది.

### పెరిగిన భారం తెలియడం లేదు



ఉచిత విద్యుత్తు పథకానికి పెట్టిన నిబంధనల వల్ల అదనపు భారం పెరిగింది. విద్యుత్తు వినియోగం 200 యూనిట్లు దాటినా ఇది ఉచితం వర్తించడం లేదు. మొత్తానికి పెరిగిన చార్జీల మేరకు లెక్కించి బిల్లు విధిస్తున్నారు. ఉచితం ఉచితం అని సంతోషపడుతున్నారు కానీ గతంకంటే విద్యుత్తు భారం పెరిగిందన్న విషయం చాలామంది గ్రహించడం లేదు. ఇప్పుడిప్పుడే ఈ విషయం ప్రజలకు అర్థం అవుతున్నది.

**- సీ శ్రీనివాస్‌రావు, బళ్లారి జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవ అధ్యక్షుడు**

### 25 వేలు బిల్లు 40 వేలు అయింది



గతంలో కమర్షియల్ విద్యుత్తుకు యూనిట్‌కు శ్లాబ్‌ల ప్రకారం రూ.5-6 మధ్యన ఉండేది. ప్రస్తుతం పెంచిన చార్జీల వల్ల ఇది ఏకంగా రూ.7.10 పెరిగింది. దీని వల్ల గతంలో రూ.25 వేలు వచ్చే బిల్లు, ప్రస్తుతం రూ. 40 వేలకు పెరిగింది. ఇది చిన్న పరిశ్రమలకు పెనుభారంగా మారింది. ఉచిత పథకాలకు డబ్బులు లేక ప్రభుత్వం ఈ రకంగా విద్యుత్తు చార్జీలను పెంచడం వల్ల చిన్న పరిశ్రమలకు తలకు మించిన భారంగా మారుతున్నది.

**- మల్లికార్జున్, పోలక్స్ జీన్స్ కంపెనీ యజమాని, బళ్లారి**

### ఉచితమంటే ప్రయోజనం లేదు



విద్యుత్తు చార్జీలు పెంచ డం వల్ల ఉచితానికి అర్థం లేకుండా పోయింది. గతం లో రూ.800 వచ్చే బిల్లు, ప్రస్తుతం రూ. 2,400 వస్తున్నది. ఈ పథకం అందరికీ వర్తిస్తుందని ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచారం చేసింది. కానీ అమలులో ఇది కొందరికి మాత్రమే వర్తిస్తుందని ఇప్పుడిప్పుడే అర్థమవుతున్నది.

**-ఆదిత్య ప్రభాకర్ జోషి, సీనియర్ జర్నలిస్టు, సేడం**

### ఉచితం పేరుతో అప్రకటిత కోతలు



ఉచిత కరెంట్ పేరుతో తీవ్రమైన కోతలు పెడుతున్నారు. దీని వల్ల మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నది. వేళాపాళా లేకుండా కోతలు విధించడం వల్ల ఎప్పుడు కరెంట్ పోతుందో, ఎప్పుడు వస్తుందో తెలియటంలేదు. చలికాలంలోనే ఇలా ఉంటే, ఇక వేసవిలో ఎలా ఉంటుందో.

**-పద్మావతి, గృహిణి, బళ్లారి**

### వ్యాపారాలు పడిపోయాయి



కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి గ్రామీణ ప్రాంతాల్లో తీవ్ర విద్యుత్తు సమస్య ఎదుర్కొంటున్నాం. 24X7 కరెంటు ఇస్తామని ఎన్నికలప్పుడు చెప్పిన కాంగ్రెస్, ఇప్పుడేమో 4 X 7 కూడా ఇవ్వడంలేదు. విద్యుత్తు సమస్యను పరిష్కరించలేక గ్రామీణ ప్రాంతాలకు కోతలు విధిస్తున్నారు. **-నాగరాజు, వాటర్ ప్లాంట్ యజమాని, బెట్టిగేరి, కొప్పాల్ తాలుకా**

## నిపుణ

విద్య, ఉద్యోగ సమాచారం

### ఎగ్జిక్యూటివ్ పోస్టులు

**ఏఐ ఇంజినీరింగ్ సర్వీసెస్ లిమిటెడ్‌లో కాంట్రాక్టు ప్రాతిపదికన కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 14
- పోస్టులు: ఎగ్జిక్యూటివ్, డిప్యూటీ మేనేజర్, ఆఫీసర్
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: నవంబర్ 28
- వెబ్‌సైట్: https://aiesl.in

### ఎఫ్ఎస్ఎన్ఎల్‌లో..

**భిలాయ్‌లోని ఫెర్రో స్క్రాప్ నిగం లిమిటెడ్‌లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 35
- పోస్టులు: ఎగ్జిక్యూటివ్/ జూనియర్ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్
- విభాగాలు: ఆపరేషన్స్, మెటీరియల్ మేనేజ్‌మెంట్, ఫైనాన్స్, అకౌంట్స్
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: నవంబర్ 25
- వెబ్‌సైట్: https://fsnl.nic.in

### నిట్‌లో..

**పట్నాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్)లో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 47
- పోస్టులు: టెక్నీషియన్, జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ అటెండెంట్ తదితరాలు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: నవంబర్ 29
- వెబ్‌సైట్: https://www.nitp.ac.in

### ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- ఎకనామిక్స్, ఫిజిక్స్, మ్యాథ్స్ (గ్రూప్స్, డీఎస్సీ) కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.